క్లుప్తంగా

ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అప్రంటీస్ షిప్ మేళా రేపు

దర్శి: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధాన మంత్రి జాతీయ అప్రంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు సహాయ అప్రంటీస్ అడ్వైజర్ ఎంవీ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేళాలో చీమకుర్తికి చెందిన జెమ్ గ్రానైట్, విజయవాడకు చెందిన జాన్సన్ లిఫ్ట్స్ అండ్ ఎస్కలేటర్స్, నెల్లూరుకు చెందిన ఎస్ఆర్సీ ఎకోటెక్, హైదరాబాద్‌కు చెందిన నిజామాన్ పవర్ సర్వీసెస్, హీరోఫార్మా, చిత్తూరుకు చెందిన అమర్‌రాజా గ్రూప్, అద్దంకికి చెందిన కల్లం టెక్స్‌టైల్స్, ఒంగోలు విజయలక్ష్మీ ఆటోమొబైల్స్ (మున్నీకార్స్), శ్రీనివాస పాలిమర్స్, జిల్లాలోని ఇతర కంపెనీ యాజమాన్యాలు, పారిశ్రామిక వేత్తలు పాల్గొంటారన్నారు. ఎంపికై న అభ్యర్థులకు శిక్షణ బృతి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 97031 65456 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు కందుల శ్రీనివాసరెడ్డి, హెచ్‌టీసీ ప్రాజెక్టు మేనేజర్ కటికల విజయకుమారి పాల్గొని మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి, విజయబాబు, అక్రమ్, జయసింహ, రమేష్‌తో పాటు, అతిథి అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా


గడియారం స్తంభం సెంటర్ నుంచి తరలి వెళ్తున్న ఇసుక టిప్పర్

దర్శి: పట్టణం నుంచి ఇసుక అక్రమంగా తరలి వెళ్తోంది. అద్దంకి రోడ్డు నుండి వచ్చే ఈ టిప్పర్‌లు కురిచేడు రోడ్డుకు వెళ్తున్నాయి. పోలీసుల కళ్లెదుట పోతున్నా ఇది అక్రమ ఇసుక అని తెలిసినా ఎవరూ లారీలను తనిఖీలు చేయక పోవడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. గడియారం స్తంభం సెంటర్ నుంచి ప్రతి గంటకు సుమారు 10 టిప్పర్‌లు వరకు తరలి వెళ్లడం గమనార్హం.

మట్టి టిప్పర్ పట్టివేత


పోలీసుస్టేషన్‌లో ఉంచిన మట్టి టిప్పర్

దర్శి:మండలం పోతవరం గ్రామం నుంచి మట్టి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. వాహనం తనిఖీ చేసి తహసీల్దార్‌కు అప్పజెప్పడం జరుగుతుందన్నారు. ఇటీవల దర్శిలో అక్రమంగా మట్టి టిప్పర్‌లు ద్వారా మట్టిని తరలించడం ఎక్కువగా ఉంది.

వైభవంగా గణనాథుల నిమజ్జనం


ముండ్లమూరు: పోలవరంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తల సందడి

కురిచేడు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు సోమవారం ఘనంగా నిమజ్జన కార్యక్రమం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణనాథుని విగ్రహాన్ని ఉంచి గులాంలు చల్లుకుంటూ పిల్లలు, పెద్దలు, మహిళలు అనే తారతమ్యం లేకుండా ఆనందోత్సాహాలతో డీజే సౌండ్ల పాటలకు నృత్యాలు చేసుకుంటూ గ్రామోత్సవాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిమజ్జనం చేశారు.

దొనకొండ: దొనకొండ, ఇండ్లచెరువు, ఎన్‌టీఆర్ కాలనీ బీసీ వసతి గృహాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి 3వ రోజు సోమవారం చిన్నారులు, యువకులు ఉత్సాహంతో మేళతాళాలు, తప్పెట్లతో నిమజ్జనం చేశారు. యువకులు గులాం చల్లుకుంటూ నృత్యం చేస్తూ మునిగిపోయారు. గణనాథులను సాగర్ కాలువ వద్దకు నిమజ్జనానికి ట్రాక్టర్‌పై తీసుకెళ్లారు.

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం కార్యక్రమాలు కోలాహలంగా నిర్వహించారు. మండలంలోని భట్లపల్లి, తూర్పుకంభంపాడు, పోలవరం గ్రామాల్లో మూడో రోజు నిమజ్జనం చేశారు. పోలవరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బూచేపల్లి అభిమానులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం కార్యక్రమంలో ఆ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువతీ యువకులు కోలాహలంగా గులాములు చల్లుకుంటూ జైగణేశా...జై జై గణేశా నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.


వై.పాలెం: బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని కుమ్మరి కాలనీ, మెట్టబజార్, సీతారామనగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా కొన్ని విగ్రహాలు మండల పరిధిలోని గంటవానిపల్లె చెరువు, మరికొన్ని విగ్రహాలు శ్రీశైలం ప్రాజెక్టుకు నిర్వహకులు నిమజ్జం కోసం తరలించారు. పర్వదినం నాటి నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వహకులు గణేషుని విగ్రహాల నిమజ్జనం సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం పట్టణంలో ఘనంగా నగరోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో, నృత్యాలతో పట్టణంలో విఘ్నేశ్వరుడిని పురవీధుల్లో ఊరేగించారు. నిమజ్జన కార్యక్రమంలో యేదుల శ్రీనివాసరెడ్డి, అరికల నారాయణరెడ్డి, గోపి, కంచర్ల శ్రీనివాసగౌడ్, చల్లా వెంకటరెడ్డి, అడుసుమల్లి మురళి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: వినాయక చవితి సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న విఘ్నేశ్వరుడి విగ్రహాలను సోమవారం నిమజ్జనానికి తరలించారు. గణనాథులను ట్రాక్టర్లపై పట్టణంలోని ప్రధాన వీధుల్లో పెద్ద ఎత్తున ఊరేగింపు చేశారు.


దొనకొండ: బీసీ వసతి గృహం విద్యార్థులు


వై.పాలెంలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథుడు

భక్తులు కుంకుమ చల్లుకొని సంబరాలు చేసుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్న గణనాథులను త్రిపురాంతకంలోని నాగార్జున సాగర్ కాలువలో నిమజ్జనం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్యకు నాయకులు సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు.

మతిస్థిమితం లేని కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


ఎమ్మెల్యే తాటిపర్తి (ఫైల్)

యర్రగొండపాలెం: మతిస్థిమితం లేని కూటమి ప్రభుత్వం తప్పుడు విధానాలను అవలబిస్తూ ఆ పార్టీ నాయకులు అన్ని రకాలుగా అడ్డంగా బుక్ అయ్యారని, వరద నివారణ చర్యలు చేపట్టలేక పోవడంతో పాటు బాధితులకు సాయం అందించలేక పోయారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. సోమవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ ప్రభుత్వం డిజాస్టర్ వ్యవస్థలను సరిగా ఉపయోగించుకోలేదని, నీటితో డ్యాంలన్నీ నిండి ఉన్నాయని, వర్షం అధికంగా ఉంటుందని తెలిసిన తర్వాత కూడా అందుకు అవసరమైన చర్యలు తీసుకోకుండా బుడమేరుకు లాకులు లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బుడమేరు వాగుపై చంద్రబాబుకు సంబంధించిన ఆస్తులు, ఏబీఎన్ చానల్ అధినేత రాధాకృష్ణ పవర్‌ప్లాంట్ ఉన్నాయన్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసని, లాకులు ఎత్తేయకుంటే వారికి సంబంధించిన ఆస్తులు మునిగిపోతాయన్న ఉద్దేశంతో అర్ధరాత్రి బుడమేరు వాగు గేట్లు ఎత్తివేయించి విజయవాడను ముంచేశారని మండిపడ్డారు. వరద వచ్చి విజయవాడలోని అనేక ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నా సీఎం చంద్రబాబు నాయుడి నుంచి 24 గంటల వరకూ స్పందన లేకుండాపోయిందని, వరద బాధితులకు నాలుగు రోజుల వరకు ఎటువంటి సాయం చేయలేక పోయారని విమర్శించారు. బుడమేరు వాగును విస్తీర్ణం చేసి 30 వేల క్యూసెక్కులకు సామర్థ్యం పెంచాలని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన పనులకు టీడీపీ నాయకులు స్టే తెచ్చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వరద సహాయక చర్యల్లో విఫలమైన చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌ను తెరపైకి తీసుకొస్తున్నారని, బుడమేరు పరిస్థితి గురించి ముందుగా అధికారులు హెచ్చరించినా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో తీవ్రంగా విఫలమైందని, పబ్లిసిటీ కోసం నానా హంగామా చేస్తున్నారే తప్ప వరద బాధితులకు ఒరిగిందేమీ లేదన్నారు. వరద బాధితుల కోసం చంద్రబాబు ఏదో చేస్తున్నట్లు ఎల్లో మీడియాలో విపరీతంగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో వచ్చిన బుడమేరు వరదల పరిస్థితి గురించి 40 ఏళ్ల ఇండస్ట్రీ చంద్రబాబు ఎందుకు గుర్తించలేకపోయారని, కృష్ణానదిపై ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తే ఫ్లడ్ కుషన్ ఎందుకు చేయలేక పోయారని, అందుకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. చంద్రబాబుకు ప్రజల ప్రాణాలంటే లెక్కలేకుండా పోవడం వల్లే బుడమేరు వాగు వరదలో 50 మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. వర్షం, వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా ప్రభుత్వం కనీస వసతులు కల్పించలేక పోయిందన్నారు. 8 రోజులపాటు లక్షల మంది ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నా కూటమి నాయకుల నుంచి స్పందన కరువైందన్నారు. ఇప్పటికైనా పబ్లిసిటీ స్టంట్‌లు మాని వరద బాధితులకు సక్రమంగా సహాయం అందించాలని ఆయన కోరారు. వర్షాలు, వరదలతో లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయని, వైఎస్సార్ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే రైతులకు సాయం అందించారని ఆయన గుర్తుచేశారు. తమ ప్రభుత్వ కాలంలో విజయవాడలో రిటర్నింగ్ వాల్ నిర్మించడం వల్లే పెను ముప్పును నివారించగలిగామని ఎమ్మెల్యే తాటిపర్తి అన్నారు.

గోశాల ఆధ్వర్యంలో ఉచితంగా ఆవులు

మార్కాపురం: పెద్దారవీడు మండలం దేవరాజు గట్టు వద్ద గోశాల ఏర్పాటు చేశామని గోశాల ప్రతినిధి నందిరెడ్డి రామిరెడ్డి సోమవారం తెలిపారు. దేవాలయాలకు, ఆశ్రమాలకు ఆవులు కావాల్సిన వారు తనను సంప్రదిస్తే ఉచితంగా ఆవులను ఇస్తామని, వివరాలకు 9885826949 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

వరద బాధితులకు రూ.85 వేల సాయం

కొమరోలు: మండలంలోని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ విజయవాడ వరద బాధితుల కోసం తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.85 వేల చెక్కును గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి సోమవారం అందజేశారు. కొమరోలు మండలంలోని పలువురు దాతల సహకారంతో సేకరించిన నగదును గిద్దలూరులోని టీడీపీ కార్యాలయంలో చెక్కు రూపంలో అందజేసినట్లుగా అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరిని అభినందించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల బహూకరణ

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సన్నపురెడ్డి శివరామకృష్ణారెడ్డి సోమవారం క్రీడా దుస్తులు బహూకరించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడానికి క్రీడా దుస్తులు లేకపోవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, పీడీ మాధవీలతలు శివరామకృష్ణారెడ్డిని సంప్రదించారు. ఆయన స్పందించి 20 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు బహూకరించినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు విరాళాల సేకరణ

పొదిలి: మల్లవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం సోమవారం విరాళాలు సేకరించారు. ఈ విరాళాలు మొత్తం రూ.10 వేలు ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డికి ఉపాధ్యాయులు పాశం సుధాకర్, రమణారెడ్డి, శ్రీనివాస్‌లు అందచేశారు. మేఘన, జ్యోతి, జెస్సి, హెప్సి, శివపార్వతి, హేమ, అక్షర, శివకృష్ణ, గౌతమ్, నరసింహ తదితరులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. పెద్ద మనసుతో విరాళాలు సేకరించిన విద్యార్థినులను ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

వినాయక నిమజ్జనం వేళ జాగ్రత్తలు తప్పనిసరి

పుల్లలచెరువు: ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున వినాయక నిమజ్జన ఉత్సవాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ బత్తుల బాబూరావు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని చాలా గ్రామాల్లో 3, 5 రోజుల్లో వినాయక నిమజ్జనం చేస్తారని తెలిసిందని, అందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుంటలు, చెరువులు, కాలవులు, వంకలు, చెక్‌డ్యాంల్లో వర్షపు నీరు చేరాయన్నారు. నిమజ్జనం సమయంలో కమిటీ వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండపాల నుంచి విగ్రహాలను వాహనాల్లో తీసుకెళ్లే సమయంలో ట్రాక్టర్లపై వీధుల్లో వచ్చేటప్పుడు విద్యుత్ తీగలు తగిలే ప్రమాదం ఉందని, గమనిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. కుంటల వద్ద నిమజ్జనం చేసే సమయంలో నీరు ఏ స్థాయిలో ఉన్నాయి, ఎంత లోతు గుంతలు ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. మద్యం తాగి ట్రాక్టర్లు నడపవద్దని తగు జాగ్రత్తలు తీసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి


మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవోలు

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని ఎంఈవోలు శామ్యూల్ జాన్, ఇందిర అన్నారు. సోమవారం మండలంలోని ఎం. ఎర్రపాలెం, మర్రివేముల, గాజులపాలెం, సింగుపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనం పరిశుభ్రమైన ప్రదేశంలో రుచికరంగా నాణ్యంగా అందజేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం ఉండాలని, రోజూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వండించాలని చెప్పారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేలా చూడాలని, నాణ్యమైన విద్యను అందించే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలన్నారు.

రాంభూపాల్‌రెడ్డి సేవలు అభినందనీయం


నగదు అందజేస్తున్న సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి

దర్శి: సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి విద్యార్థులకు చేస్తున్న సేవలు అభినందనీయమని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్ అన్నారు. స్థానిక ఆ పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు రూ.5116, రూ.3116, రూ.2116 బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కూడా బాగా రాణించాలని ఉన్నత లక్ష్యంతో వారికి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. బసిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీ మద్దతుతో సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఉపాధ్యాయులు పి.వెంకటేశ్వరరెడ్డి, పీడీ అంజిరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు


ఒబ్బాపురంలో వర్షానికి నిలిచిన నీరు


పోలేపల్లి ఎస్సీ కాలనీలో నిలిచిన నీరు

దొనకొండ: మండలంలోని ఒబ్బాపురం, పోలేపల్లి ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు వర్షానికి అధ్వానంగా తయారయ్యాయి. వర్షం కురిసిన సమయంలో నీరు ఇళ్లల్లో చేరి రోడ్లపై నిలుస్తున్నాయి. వాహన చోదకులు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే ఇబ్బందికరంగా ఉంది. నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పది రోజుల పాటు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు ముక్కు మూసుకుని బయటకు వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో విష సర్పాలు తిరుగుతుంటాయి. చుట్టుపక్కల ప్రజలు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు రూ.లక్ష సాయం


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న లక్ష్మీరెడ్డి

తాళ్లూరు (దర్శి): విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా తాళ్లూరు గ్రామానికి చెందిన యడమకంటి లక్ష్మీరెడ్డి లక్ష రూపాయల ఆర్థిక సాయం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు. తాళ్లూరు గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి బెంగళూరులో వ్యాపారాలు చేస్తూ అక్కడ స్థిరపడ్డారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడమకంటి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం


ముండ్లమూరు: పౌష్టికాహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్ సునీత


దొనకొండ: మాట్లాడుతున్న సుభాషిణి

ముండ్లమూరు (దర్శి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారంతో ఆరోగ్యం మెరుగు పడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. సునీత అన్నారు. మండలంలోని నూజిళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్నారులు తీసుకోవాల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ఏడో నెల నుంచి తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు సమపాలలో అందించాలన్నారు. కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న బాలామృతం చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. హెచ్ఎంలు లేవి ప్రసాద్, పద్మ, సిబ్బంది అనూరాధ, జయశ్రీ, ఆదిలక్ష్మి, శేసమ్మ పాల్గొన్నారు.

దర్శి: గర్భిణులు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని చందలూరు పీహెచ్‌సీ వైద్యురాలు బ్లెస్సీ సూచించారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ పథకం కింద పీహెచ్‌సీ పరిధిలోని 28 మంది గర్భిణులకు రక్త పరీక్షలు, సుగర్, హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపింగ్, బరువు, ఎత్తు, బ్లడ్ ప్రజర్, యూరిన్ వంటి 20 రకాల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి బ్లెస్సీ మాట్లాడుతూ ప్రతి గర్భిణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి ఒక్కరికీ కాన్పులు చేస్తామని చెప్పారు. ప్రసవం కావాలని ఆపరేషన్‌లు వద్దని ఎంతో మంది ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. ప్రతి నెలా తప్పని సరిగా ప్రభుత్వం అందిస్తున్న మందులు వాడాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. రక్త హీనత ఉన్న గర్భిణులకు ఇంజెక్షన్‌లు వేశారు. సీహెచ్‌ఓ దయామని, హెచ్ఈఓ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ వసంత్‌కుమార్, స్టాఫ్‌నర్స్ ఉషారాణి, పుల్లారావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పోలేపల్లిలో పోషకాహార వారోత్సవాలు

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పప్పు, నూనె, రాగి పిండి, అటుకులు, చెక్కిళ్లు, కర్జూరాలు, బెల్లం, బాలామృతం, గుడ్లు, పాలు తీసుకోవటం ద్వారా సమతుల్య ఆహారం అందించటమే కాకుండా ఐరన్ పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు మునగ ఆకు తీసుకుంటే విటమిన్ ఏ ఉంటుందన్నారు. అనంతరం చిన్నారుల బరువులను చూశారు. కార్యకర్త రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం సంతోషకుమారి పాల్గొన్నారు.


దర్శి: గర్భిణులను పరిశీలిస్తున్న డాక్టర్ బ్లెస్సీ

రూ.2.14 లక్షలు పలికిన వినాయకుని లడ్డూ

కంభం: మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయకుడి లడ్డూ వేలం పాటలో రూ.2.14 లక్షలు పలికింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మనుమాసు జ్యోతివీరారెడ్డి వేలంలో లడ్డూను దక్కించుకున్నారు


జంగంగుంట్లలో రూ.2.14 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ